సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 21 । నవంబర్ । 2024



అన్నదాన ప్రభువే..
కొత్తగూడెంలోని శ్రీధర్మశాస్తా ఆలయంలో 24 ఏళ్లుగా అయ్యప్ప మాలధారులకు భిక్ష, అల్పాహారం ఉచితంగా అందిస్తున్నారు. 8లో



రోడ్డెక్కిన పత్తి రైతులు
జూలూరుపాడు మార్కెట్ యార్డులో ముందస్తు సమాచారం లేకుండా పత్తి కొనుగోళ్లు నిలిపేశారంటూ రైతులు ధర్నా చేశారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
29°/16°

వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి తీవ్రత ఉంటుంది.

మెడికల్‌లో మెస్ గోల!


కొత్తగూడెంలోని వైద్య కళాశాల

వైద్య కళాశాలలో పూర్తికాని హాస్టల్, మెస్ నిర్మాణ పనులు

- ప్రైవేట్ హాస్టళ్లు, హోటళ్లను ఆశ్రయిస్తున్న విద్యార్థులు
- గతంలో కాలేజీ మెస్ బాగా లేదంటూ ఆందోళన
- కాంట్రాక్టు రద్దుతో నెలల తరబడి ఇబ్బంది పడిన విద్యార్థులు
- భోజనం విషయంలో మళ్లీ తప్పని ఇక్కట్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాకు 2022 – 23 విద్యాసంవత్సరంలో 150 సీట్లతో వైద్య కళాశాల మంజూరైంది. నర్సింగ్ కాలేజీ కోసం నిర్మించిన భవనాల్లోనే మెడికల్ కాలేజీ తరగతులు ప్రారంభించారు. ఇప్పటికే రెండు బ్యాచ్‌ల విద్యార్థులు ఇక్కడ చదువుతుండగా మరో బ్యాచ్ విద్యార్థులు కూడా రానున్నారు. ఇక్కడ చదివే అమ్మాయిలు, అబ్బాయిలకు పాల్వంచలో వేర్వేరుగా హాస్టళ్లు నిర్వహిస్తున్నారు. విద్యార్థులే సొంతంగా డబ్బు చెల్లించేలా మెస్ కాంట్రాక్టర్‌ను నియమించారు. అయితే నాణ్యమైన భోజనం అందడం లేదని విద్యార్థులు గత మార్చిలో ఆందోళన చేయగా సదరు కాంట్రాక్టర్‌ను తప్పించారు. ఆ తర్వాత ఐదారు నెలల పాటు విద్యార్థులు ఇబ్బంది పడినా మరే ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. ఇటీవల మహిళా శక్తి పేరుతో స్వయం సహాయక సంఘానికి అప్పగించినా పరిస్థితి మారలేదు.

వాట్సాప్ గ్రూపులో చర్చ..

మెడికల్ కాలేజీ విద్యార్థుల తల్లిదండ్రులకు సంబంధించిన వాట్సాప్ గ్రూపులో మెస్‌లో భోజనం బాగా లేని విషయంపై చర్చ జరిగింది. దీంతో కొందరు తల్లిదండ్రులు చొరవ చూపించి భోజనంలో లోపాలు లేకుండా చూడాలని మెస్ నిర్వాహకుడితో పాటు కాలేజీ మేనేజ్‌మెంట్‌కు చెప్పారు. అక్కడి నుంచి సరైన భరోసా రాకపోవడంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం.

బస్ సర్వీస్‌ల పంచాయితీ..

వైద్య కళాశాల తరగతి గదులు, హాస్టల్, బోధనాస్పత్రులు వేర్వేరు చోట ఉండటంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. దీంతో కాలేజీ అవసరాల కోసం అద్దె ప్రాతిపదికన మూడు బస్సులను గతేడాది ఏర్పాటు చేశారు. ముందుగా వీటిని ఇతర ప్రాంతాల నుంచి కొత్తగూడెం వచ్చే ప్రథమ సంవత్సర విద్యార్థులకే ఉపయోగించాలని, అందుకు సంబంధించిన చార్జీలను వారే చెల్లించాలని నిర్ణయించారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితుల కారణంగా ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పలువురు కూడా ఈ బస్ సర్వీస్‌ను ఉపయోగించుకున్నారు. దీంతో తమతో పాటు సెకండియర్ విద్యార్థుల నుంచి కూడా బస్ చార్జీలు వసూలు చేయాలని ఫస్టియర్ వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే ద్వితీయ సంవత్సర విద్యార్థుల నుంచి దీనిపై సానుకూల స్పందన కరువైంది. ఇలా బస్ సర్వీస్‌ల బకాయిలు పేరుకుపోతున్నాయి. గత ఫిబ్రవరి నుంచి అక్టోబర్ వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడంతో ఇటీవల సదరు కాంట్రాక్టర్ సర్వీసు నిలిపేసేందుకు సిద్ధం కాగా చర్చలు, హామీలతో వెనక్కి తగ్గాడు.

ఇన్‌చార్జ్‌ల పాలన

మెడికల్ కాలేజీకి మొదట ప్రిన్సిపాల్‌గా లక్ష్మణ్‌రావు నియమితులయ్యారు. అయితే నిర్వహణ పరమైన లోపాలపై ఆరోపణలు రావడంతో ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఆయనను బదిలీ చేశారు. అప్పటి నుంచి పాథాలజీ ప్రొఫెసర్ రాజ్‌కుమార్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో కాలేజీ నిర్వహణ వ్యవహారాల్లో పూర్తిస్థాయి నిర్ణయాలు ఆయన తీసుకోవడం లేదు. ఫలితంగా ఇక్కడ సమస్యలు నానాటికీ పేరుకుపోతున్నాయి. ఇప్పటికైనా మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు స్పందించి వైద్య కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

భయాందోళనలో విద్యార్థులు..

ఇటీవల మెడికల్ కాలేజీ హాస్టళ్లకు సరఫరా చేసిన భోజనం తిని కొందరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అయితే ఈ విషయాన్ని కాలేజీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడానికి విద్యార్థులు వెనకాడుతున్నారు. గతంలో మెస్ బాగా లేదని ఫిర్యాదు చేస్తే.. పరిష్కారం చూపకపోగా నెలల తరబడి తిండికి ఇబ్బంది పడే దుస్థితి ఎదురైంది. దీంతో మధ్యాహ్నం వేళ పస్తులున్న విద్యార్థులకు.. రాత్రి వేళ భోజనానికి పాల్వంచ పట్టణంలోని హోటళ్లే దిక్కయ్యాయి. ఒక్కోసారి పదుల సంఖ్యలో వచ్చే విద్యార్థులకు ఆ హోటళ్లు కూడా భోజనం అందించలేకపోయాయి. దీంతో మెస్ విషయంలో మరోసారి ఫిర్యాదు చేస్తే పరిస్థితి మరింత దిగజారుతుందనే భయాందోళనలో విద్యార్థులు ఉన్నారు.

మెస్‌లో సమస్య లేదు

మెస్‌లో సమస్య ఉన్న అంశం నా దృష్టికి రాలేదు. ఒకరిద్దరు విద్యార్థులు బయట తినడం వల్ల ఫుడ్ పాయిజన్ అయి ఇబ్బంది పడ్డారు. బస్సులకు సంబంధించిన విషయంలో కాలేజీ మేనేజ్‌మెంట్ కేవలం అనుసంధానకర్త మాత్రమే. పూర్తి బాధ్యత మాది కాదు.

– రాజ్‌కుమార్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్

విద్యార్థులతోనే దేశ భవిష్యత్


ప్రతిభ చాటిన విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ పాటిల్, పక్కన ఎస్పీ, ఎమ్మెల్యేలు

- వారి మేధస్సు దేశానికి అవసరం
- చిన్నప్పటి నుంచే అన్ని రంగాలపై దృష్టి పెట్టాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

అన్నపురెడ్డిపల్లి (చండుగొండ) : విద్యార్థుల మేధస్సు దేశానికి అవసరమని, వారి పైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. అన్నపురెడ్డిపల్లి గురుకుల కళాశాలలో మూడు రోజులుగా కొనసాగుతున్న జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలు, వైజ్ఞానిక ప్రదర్శనలపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల ప్రయోగాలను పరిశీలించి.. అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. నిత్యం మంచి ఆలోచనలతో ఉంటే చదువుతోపాటు ఇతర అంశాలపై దృష్టి సారించవచ్చని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయ రంగమేనని, వ్యవసాయం అంటే కూలీ పని కాదని, సమాజంలో రైతులదే ప్రథమ స్థానమని చెప్పారు. ఎస్పీ రోహిత్‌రాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని సూచించారు. నైపుణ్యంతో నేర్చుకునే ప్రతీ అంశం జీవితంలో పనికొస్తుందని అన్నారు. చెడు వ్యసనాల జోలికి పోకుండా విలువలు, క్రమశిక్షణతో మెలగాలని హితవు పలికారు. అంతకు ముందు ఆయన శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు.

అంకితభావంతో ముందుకు సాగాలి

మారుమూల ప్రాంతమైనప్పటికీ జిల్లా నలుమూలల నుంచి 800 పైగా ఎగ్జిబిట్స్ రావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. విద్యార్థులు ఇదే అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన అధికారులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతంలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేసిన జారే ఆదినారాయణను 'శభాష్ తమ్ముడు' అంటూ అభినందించారు.

రాష్ట్రస్థాయికి 27 మంది..

జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో అసాధరణ ప్రతిభ కనబర్చి ప్రయోగాలు ప్రదర్శించిన 27 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వారికి కలెక్టర్, ఎస్పీలతో పాటు ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, కోరం కనకయ్య చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డీఈఓ వెంకటేశ్వరాచారి, డీఎస్‌ఓ చలపతిరాజు, తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంఈఓ ఆనంద్‌కుమార్, పర్సా వెంకట్, గాంధీ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు నేటి నుంచి శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అండర్– 17 బాలుర రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసిన విషయం విదితమే. ఎంపికైన రాష్ట్ర జట్టు సభ్యులు ఈనెల 30 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు జమ్మూ కశ్మీర్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ జట్టులో వివిధ జిల్లాల క్రీడాకారులు ఉండగా.. జట్టు సమన్వయం కోసం గురువారం నుంచి ఐదు రోజుల పాటు స్థానిక ప్రగతి మైదానంలో శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహక కార్యదర్శి వాసిరెడ్డి నరేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. గౌతంపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ బట్టు ప్రేమ్‌కుమార్ నేతృత్వంలో శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

పొదుపుతోనే జీవితంలో మలుపు

లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంరెడ్డి


మాట్లాడుతున్న ఎల్‌డీఎం రాంరెడ్డి

అశ్వారావుపేటరూరల్: చిన్న పొదుపుతోనే ప్రతి ఒక్కరి జీవితాల్లో మలుపు సాధ్యమని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వి.రాంరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించగా, ఆయన హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్కరి జీవితంలో ఆర్థిక యాజమాన్యం ఎంతో అవసరమని అన్నారు. ఆర్థిక లావాదేవీలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆర్థిక నిపుణులు కె.వి.బాబూరావు మాట్లాడుతూ.. ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యత, ఆర్థిక వ్యవహారాల్లో లోటుపాట్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, ప్రొఫెసర్లు డాక్టర్ టి.శ్రావణ్‌కుమార్, డాక్టర్ కె.శిరీష, డాక్టర్ ఐ. కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నిక


నూతన కమిటీతో డీవైఎస్‌ఓ తదితరులు

పాల్వంచ: జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యవర్గాన్ని పాల్వంచలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పరంధామరెడ్డి సమక్షంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ జి.యుగంధర్ రెడ్డి, కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎస్‌కె.హుస్సేన్, ఉపాధ్యక్షులుగా వై.వెంకటేశ్వర్లు, బి.ఎం.ప్రేమ్‌కుమార్, మొగిలి, నాగేంద్ర త్రివేదిని ఎన్నుకున్నారు. అనంతరం పరంధామ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో క్రీడలను మరింతగా ప్రోత్సహించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారిణి సింధు తపస్వి, బార్ కౌన్సిల్ సభ్యులు అనుదీప్, కె.మహిధర్, భూపేష్, రమేష్, బీహెచ్ రావు, కబీర్‌దాస్, రామిరెడ్డి, భాస్కర్, సతీష్, డానియేల్, రాంబాబు పాల్గొన్నారు.

నేడు, రేపు మాజీ మంత్రి హరీశ్‌రావు పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ మంత్రి హరీశ్‌రావు గురు, శుక్రవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఒక ప్రకటనలో తెలిపారు. లగచర్ల గిరిజనులకు సంఘీభావంగా గురువారం సాయంత్రం ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుండి జెడ్పీ సెంటర్‌లోని అంబేడ్కర్ సెంటర్ వరకు సాగే ర్యాలీలో హరీశ్‌రావు పాల్గొంటారని వెల్లడించారు. అలాగే, శుక్రవారం ఉదయం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి, మిర్చి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. ఆతర్వాత బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడతారని తెలిపారు. మధ్యాహ్నం చింతకాని మండలం ప్రొద్దుటూరులో ఆత్మహత్య చేసుకున్న రైతు బోజడ్ల ప్రభాకర్ కుటుంబంతో పాటు ఇటీవల జైలుకు వెళ్లొచ్చిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను పరామర్శించడమే కాక చింతకాని మండలం లచ్చగూడెంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో మృతి చెందిన రైతు గూని ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు.

శ్రీరామ పునర్వసు దీక్షలు ప్రారంభం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు


క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తున్న ఈఓ, అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో బుధవారం శ్రీరామ పునర్వసు దీక్షలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్తీక మాసంలో పునర్వసు నక్షత్రం రోజున శ్రీరామ దీక్షలను భక్తులు స్వీకరించడం ఆనవాయితీ. శ్రీరామ మాలను స్వీకరించేందుకు తరలివచ్చిన పలువురు భక్తులు తొలుత పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించాక ఆలయానికి చేరుకున్నారు. అర్చకులు మాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. కాగా డిసెంబర్ 17 మార్గశిర పునర్వసు రోజున ఈ దీక్షల విరమణ ఉంటుంది. ఆ రోజు గిరి ప్రదక్షిణ, పాదుకా పూజ, సాయంత్రం వెండి రథ సేవ, 18న శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ..

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సర క్యాలెండర్లు, డైరీలను బుధవారం ఆవిష్కరించారు. అంతరాలయంలో రామయ్య పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజల అనంతరం ఈఓ ఎల్.రమాదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వామి వారి అవతారాలు, ప్రధాన ఉత్సవాలకు సంబంధించి చిత్రాలతో అందంగా తయారు చేసిన క్యాలెండర్లు భక్తుల కోసం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వీటితో పాటు ఈ ఏడాది డైరీలను సైతం తయారు చేయించి విక్రయశాలల్లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

న్యాయ సలహాదారుడిగా దమ్మపేట వాసి


గోళ్ల భవానీ కృష్ణ (ఫైల్)

దమ్మపేట: తెలంగాణ డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ (టీడీఎస్ఏ) న్యాయ సలహాదారుడిగా దమ్మపేటకు చెందిన యువ న్యాయవాది గోళ్ల భవానీకృష్ణయాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు టీడీఎస్ఏ అధ్యక్షుడు బలుసాని మణిదీప్, న్యాయ సలహాదారుడిగా భవానీకృష్ణను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వామ్యం కావాలి


సమావేశమైన కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎమ్మెల్యేలు కూనంనేని, పాయం, వెంకట్రావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్సార్ నిధులు అందజేసి జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, కోరం కనకయ్యతో పాటు వివిధ పరిశ్రమల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సామాజిక, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సీఎస్సార్ నిధులు కేటాయిస్తామని తెలిపారు. జిల్లాలోని పరిశ్రమలు తమ వంతు బాధ్యతగా రెండు శాతం నిధులు అందజేయాలని కోరారు. గతంలో సీఎస్సార్ నిధుల కింద జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో పలు అభివృద్ధి పనులు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధుల సూచన మేరకు అవసరమైన పనులకు ఈ నిధులు వినియోగించేలా ప్రణాళిక రూపొందిస్తామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, సింగరేణి, కేటీపీఎస్, ఐటీసీ, నవభారత్, బీటీపీఎస్ పరిశ్రమల ఉన్నతాధికారులు, జిల్లా పరిశ్రమల అధికారి తిరుపతయ్య, సీపీఓ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

కాందిశీకుల భూముల పరిశీలన..

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పాండురంగాపురం, రెడ్డిగూడెం గ్రామాల మధ్య గల 40 ఎకరాల కాందిశీకుల భూములను కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం ఆ భూమిని ఎవరు సాగు చేస్తున్నారనే వివరాలను ఆరా తీశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వేణుగోపాల్, తహసీల్దార్ వివేక్, ఆర్‌ఐ హచ్యా ఉన్నారు.

సన్నరకం.. ధర మందం

- మార్కెట్‌లో సన్నరకం ధాన్యానికి తగ్గిన డిమాండ్
- సాగు విస్తీర్ణం పెరగడంతో దక్కని మద్దతు ధర
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తేనే 'ఎంఎస్‌పీ'
- అక్కడ అమ్మాలంటే తేమ శాతం తంటాలు..


బూర్గంపాడు మార్కెట్‌యార్డులో అమ్మకానికి వచ్చిన ధాన్యం

బూర్గంపాడు: మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండే సన్నరకం ధాన్యం ధర ఈ ఏడాది మందమైంది. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించటంతో రైతులు ఎక్కువగా ఈ రకాలనే సాగుచేశారు. పొరుగు రాష్ట్రాల్లోనూ ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరడగంతో ధాన్యం ధరపై ప్రభావం పడుతోంది. గత ఐదారేళ్లుగా సన్నరకం ధాన్యాన్ని రైతులు కోసిన వెంటనే మిల్లర్లు పచ్చి వడ్లనే అధిక ధరలకు కొనుగోలు చేసేవారు. గతేడాది వానాకాలం సీజన్‌లో సన్నరకం ధాన్యం పచ్చివే క్వింటా రూ.2,300 నుంచి రూ.2,700 వరకు ధర పలికింది. ఈ సంవత్సరం మాత్రం సన్నరకం ధాన్యం కొనుగోళ్లకు మిల్లర్లు అంతగా ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం బాగా ఆరిన ధాన్యాన్నే క్వింటా రూ.2వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు.

1.75 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలో ఈ ఏడాది సుమారు 1.75లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇందులో 80 శాతం సన్నరకాలే ఉన్నాయి. అయితే అధిక వర్షాలు, తెగుళ్లు, పురుగు, దోమ ఉధృతితో ఈ రకం ధాన్యం సాగుకు పెట్టుబడి ఖర్చులు పెరగగా, దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరాకు 25 నుంచి 30 బస్తాల వరకే దిగుబడి వస్తుండడం, మరోవైపు ఖర్చులు పెరగడం రైతులను కలవరపరుస్తోంది. ఇక మార్కెట్‌లో సన్నరకం ధాన్యానికి డిమాండ్ ఉంటుందని ఆశించినా ప్రతికూల పరిస్థితులే ఎదురయ్యాయి. గతంలో సన్నరకం ధాన్యాన్ని కోసిన వెంటనే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మిల్లర్లు పచ్చి వడ్లనే అధిక ధరకు కొనుగోలు చేసేవారు. ఈ సంవత్సరం ఆ రాష్ట్రాల్లోనూ వరి సాగు విస్తీర్ణం పెరగడంతో అక్కడి మిల్లర్లు ఇటు రావడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన రూ. 500 బోనస్ వస్తుందనే ఆశతో రైతులు ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో సన్నరకాలను సాగు చేశారు. అధిక పెట్టుబడి పెట్టినా సరైన దిగుబడి రాకపోవడంతో దిగులు చెందుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే రైతులకు ధాన్యం నగదు ముందుగా చెల్లిస్తున్న అధికారులు.. ఆ తర్వాత రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బు జమ చేస్తామని చెబుతున్నారు. అలా కాకుండా మొత్తం డబ్బు కొనుగోలు కేంద్రాల్లో వెంటనే చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ కేంద్రాల్లో తేమ శాతం కొర్రీలు

మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకే సన్నరకం ధాన్యం కొనుగోలు చేస్తుండగా.. మద్దతు ధర దక్కాలంటే రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి. అక్కడ మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ కూడా చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమశాతం 17కు మించకూడదు. ఇందుకు కనీసం వారం, పది రోజుల పాటు ధాన్యాన్ని ఆరబెట్టాలి. ఇక కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే ధాన్యానికి రైతులే హమాలీ చార్జీ కింద క్వింటాకు రూ.100కు పైగా చెల్లించాల్సి వస్తోంది. అదే ప్రైవేటు వ్యాపారులకు అమ్మితే ఈ ఖర్చులన్నీ వారే భరిస్తారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలి. ధాన్యం రోజుల తరబడి ఆరబెట్టాలంటే చాలా ఖర్చులవుతున్నాయి. ఈ ఏడాది సన్న రకం వడ్లు సాగు చేస్తే ఎకరానికి 25 బస్తాల దిగుబడి వచ్చింది. పెట్టుబడులు బాగా పెరిగాయి. వడ్లు అమ్మితే పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– నీరుడు రాజు, రైతు, బూర్గంపాడు

బోనస్ కూడా వెంటనే చెల్లించాలి



ధాన్యం డబ్బుతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు రూ. 500 బోనస్ కూడా రైతుల ఖాతాల్లో వెంటనే జమచేయాలి. ఈ ఏడాది దిగుబడులు బాగా తగ్గాయి. పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి. కొనుగోలు కేంద్రాలలో అమ్మిన ధాన్యానికి హమాలీ చార్జీలు ప్రభుత్వమే భరించాలి.

– ఆవుల వెంకటేశ్వరరెడ్డి, రైతు, రెడ్డిపాలెం

ఏఐటీయూసీ పోరాట ఫలితమే హక్కులు..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): దేశంలో, రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు అనుభవించే ప్రతీ హక్కు ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే వచ్చాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రుద్రంపూర్ కమ్యూనిటీ హాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. పని భద్రత, కనీస వేతనాలు అమలు చేయడం పాలకులు, యాజమాన్యాల బాధ్యత అని అన్నారు. అయితే నేడు దీన్ని విస్మరించి పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఎన్నో పోరాటాలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించిన కేంద్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమాన్ని యాజమాన్యాలకు, పారిశ్రామిక వేత్తలకు తాకట్టు పెడుతోందని ఆరోపించారు. ఆదానీ, అంబానీ వంటి పెట్టుబడిదారులకు మోదీ సర్కార్ ఊడిగం చేయడం మినహా దేశ ప్రజలకు, కార్మికులకు చేసిందేమీ లేదని విమర్శించారు. చట్టాలు, హక్కుల అమలుకు కార్మికులు తిరగబడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, కార్యదర్శి సింగు నరసింహారావు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌కే సాబీర్‌పాషా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కంచర్ల జమలయ్య, ప్రసాద్, వట్టికొండ మల్లికార్జునరావు, గోనె మణి, డి.శంకర్, వేల్పుల మల్లికార్జున్, టి.రాజు, రాంచందర్, బండి నాగేశ్వరావు, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, బంధం నాగయ్య, కె రాము తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీజీసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు


డాక్టర్ జయంతి

ఇల్లెందు: ఇల్లెందు పట్టణం 16వ వార్డుకు చెందిన డాక్టర్ జయంతికి తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష (టీజీసెట్–2024) ఫలితాల్లో 9వ ర్యాంకు లభించింది. బుధవారం వెల్లడైన ఫలితాల్లో ఆమె అత్యుత్తమ మార్కులు పొందారు. ఆమె భర్త డాక్టర్ శ్రీధర్‌లోద్ హనుమకొండ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. 2022లో కాకతీయ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసిన జయంతిని పలువురు అభినందించారు.

తెలంగాణ ఉద్యమకారుడు మృతి


పుష్పరాజ్ (ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్‌బస్తీకి చెందిన బండి పుష్పరాజ్ అలియాస్ డిష్ రమేశ్ (50) అనారోగ్యంతో బుధవారం మృతిచెందగా పలువురు నివాళులర్పించారు. నెలన్నర కిందట ఆయన సతీమణి రాధిక కూడా మృతి చెందింది. మలి దశ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన పుష్పరాజ్.. ఒక దశలో పట్టణంలోని గోవింద్ సెంటర్ బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ సృష్టించాడు. ఆనాడు రమేశ్‌పై ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. రమేశ్, ఆయన సతీమణి రాధిక మృతితో వారి పిల్లలు అనాథలయ్యారు.

ముగ్గురిపై కేసు

పాల్వంచరూరల్: ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగించి.. ఇసుకను అన్‌లోడ్ చేసిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మండలంలోని నాగారం సమీపంలోని కిన్నెరసాని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం రాత్రి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బి.హరినాయక్ పట్టుకున్నారు. దానిని కార్యాలయానికి తరలిస్తుండగా ట్రాక్టర్ ఓనర్ అన్నపురెడ్డి తమయ్య, అతని సోదరుడు జైసూర్య, డ్రైవర్ బి.రవి కలిసి దౌర్జన్యంగా ఇసుకను అన్‌లోడ్ చేశారు. ఎఫ్‌బీఓ హరినాయక్ ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

టేకు దిమ్మెలు స్వాధీనం


టేకు దిమ్మెల వద్ద ఎఫ్‌ఎస్‌ఓ గోవింద్, సిబ్బంది

కరకగూడెం: అనుమతులు లేని టేకు కలపను స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిపై ఫారెస్ట్ అధికారులు కేసు నమోదు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. అనంతారం ఎఫ్‌ఎస్‌ఓ గోవింద్ కథనం ప్రకారం.. కొత్తగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి వెనకాల పత్తి చేనులో బుధవారం తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా కలప దిమ్మెలను నిల్వ ఉంచగా వాటిని స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కలప విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందన్నారు. తనిఖీల్లో ఫారెస్ట్ బీట్ అధికారులు రోజా, లక్ష్మీనర్సు, బేస్ క్యాంపు సిబ్బంది రాంబాబు, సాంబ, గణేశ్ పాల్గొన్నారు.

నాటుసారా పట్టివేత


నాటుసారా, నిందితుడితో ఎస్‌ఐ, కానిస్టేబుల్

టేకులపల్లి: మండలంలో బుధవారం వాగొడ్డు తండా, లచ్యతండా, ఏ–కాలనీ, బీ–కాలనీ, చంద్రుతండా, శంభునిగూడెం గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టింది. 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్‌ఐ గౌతమ్, సిబ్బంది రామకృష్ణగౌడ్, హబీబ్, గురవయ్య, సుమంత్, శ్రావణి, రమేశ్ పాల్గొన్నారు. ఎస్‌ఐ పి.సురేశ్ ఆధ్వర్యంలో మండలంలోని మద్రాస్‌తండాలో తనిఖీలు నిర్వహించగా బాణోతు రాంబాబు ఇంట్లో రెండున్నర లీటర్ల నాటుసారా లభించింది. సారాను స్వాధీనం చేసుకుని బాధ్యుడిపై కేసు నమోదు చేశారు.

ఏడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చింతకాని: మండలంలోని చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఏడు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. వైరా సీఐ సాగర్, ఎస్సై నాగుల్‌మీరా ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తేలింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేయడమేకాక యజమానిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా, మండలంలోని చిన్నమండవ, తిమ్మినేనిపాలెం మున్నేరు నుంచి ఇసుకను తరలింపునకు అడ్డుకట్ట వేసేలా సిబ్బంది గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

అద్దె బకాయిలు రాక 8 నెలలు


రామవరంలోని అంగన్‌వాడీ సెంటర్

- గత ఫిబ్రవరిలో ఆరు నెలల అద్దె విడుదల
- ఆ తర్వాత 785 అంగన్‌వాడీలకు మళ్లీ బిల్లులు పెండింగ్..
- యజమానుల ఒత్తిడితో ఇబ్బంది పడుతున్న టీచర్లు

కొత్తగూడెంటౌన్: అంగన్‌వాడీలకు అద్దె బిల్లుల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. చాలీచాలని వేతనాలతో ఇల్లు గడవడమే కష్టం అనుకుంటే అద్దెలు ఎలా చెల్లించాలని 8 నెలలుగా పెండింగ్ బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అద్దెలు కడతారా? లేదా ఖాళీ చేస్తారా?.. భవనాలకు తాళం వేస్తామని ఓనర్లు ఒత్తిడిని చేస్తున్నారని, సెంటర్ల నిర్వహణకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

785 సెంటర్లు అద్దె భవనాల్లోనే..

జిల్లాలోని మెయిన్ అంగన్‌వాడీ సెంటర్‌లు 2,060 ఉన్నాయి. అందులో 782 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా మరో 493 కేంద్రాలు ఉచిత భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇక 785 సెంటర్లను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఒక్కో సెంటర్‌కు ఆయా ఏరియాలను బట్టి రూ.1000 నుంచి రూ.4 వేల వరకు అద్దెలు చెల్లించాల్సి ఉంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఒకటి, రెండు లేదా మూడు గదుల్లో నిర్వహణ కొనసాగుతోంది. అయితే, ఏనెలకానెల అద్దె బిల్లులు ఎప్పుడు కూడా మంజూరు కావడం లేదు. 2023 సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఆరు నెలల అద్దె బకాయిలు రూ.84,91,420ను ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం చెల్లించింది. ఆపై మళ్లీ ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఇక ఈ ఏడాది మార్చి నుంచి అక్టోబర్ వరకు ఎనిమిది నెలల అద్దె బిల్లులు అంగన్‌వాడీ సెంటర్లకు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ విషయంలో ఐసీడీఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అంగన్‌వాడీ టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అద్దె బకాయిలు రాకపోవడంతో యాజమానుల ఒత్తిడితో తాము ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అద్దె బకాయిలన్నీ చెల్లించడమే కాక, ఇక నుంచి ఏనెలకానెల విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..



అంగన్‌వాడీ సెంటర్ల అద్దె బకాయిలు కొంత మేర ఈ ఏడాది ఫిబ్రవరిలో చెల్లించాం. ఇంకా ఎనిమిది నెలల బకాయిలు ఉన్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం. నిధులు మంజూరు కాగానే చెల్లిస్తాం.

–స్వర్ణలత లెనీనా, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

టిప్పర్, లారీ ఓనర్ల అసోసియేషన్ ఎన్నికలకు బ్రేక్

అనుమతి లేదంటూ అడ్డుకున్న పోలీసులు


సీఈఆర్ క్లబ్ వద్ద మాట్లాడుతున్న బీఎస్పీ నాయకుడు కామేశ్

కొత్తగూడెంఅర్బన్/కొత్తగూడెంటౌన్/కొత్తగూడెం రూరల్: సింగరేణి సంస్థలో టిప్పర్, లారీ ఓనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు జరగకుండా అడ్డుకోవడం సరికాదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ పేర్కొన్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు కొత్తగూడెం బుధవారం సీఈఆర్ క్లబ్‌లో సిద్ధమవుతుండగా కామేశ్‌తో పాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులను రెండు వర్గాలుగా విడగొట్టి నెలల తరబడి తిప్పుకుంటున్నా కొందరు పెత్తనం కోసం యత్నిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు జేబీ శౌరీని కలిసి మాట్లాడాక ఇరువర్గాలు సంప్రదించి ఎన్నికల నిర్వహణకు నిర్ణయించారని చెప్పారు. ఆపై నామినేషన్ల స్వీకరణ, తదితర ప్రక్రియలు పూర్తిచేసి గురువారం సీఈఆర్ క్లబ్‌లో ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తే పర్యవేక్షకులుగా వెళ్లిన తనతో పాటు మారపాక రమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. పారదర్శకంగా జరుగుతున్న ఎన్నికను అడ్డుకోవడం సరికాదన్నారు. కాగా, కామేశ్, రమేశ్‌తో పాటు బూర్గుల అనిల్‌కుమార్, తానంగి రవికుమార్, మైల చైతన్య, పెండ్యాల శ్రీనివాస్, దువ్వ సంపత్‌కుమార్, కాంటాత్మక ముకేశ్, నారా మహేందర్, కోలా నాగవర్మ, పలువురు లారీ ఓనర్లు, డ్రైవర్లను పోలీసులు అదుపులోకి తీసుకునే సమయాన రసాభాసగా మారింది. అయితే, అనుమతి లేకుండా ఎన్నిక నిర్వహిస్తుండటంతో వారిని అదుపులోకి తీసుకుని ఆ తర్వాత సొంత పూచీకత్తుపై విడుదల చేశామని సీఐ కరుణాకర్ వెల్లడించారు. కాగా, లారీ ఓనర్ అసోసియేషన్లకు సంబంధించి రెండు వర్గాల్లో యజమానులు ఐక్యంగా ఉన్నందున అవాంతరాలు లేకుండా ఎన్నికలు జరిగేలా చూడాలని డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య సూచించారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ కొన్ని పార్టీల నాయకులు చిచ్చు పెట్టేలా వ్యవహరిస్తున్నందున యజమానులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో నాయకులు జేబీ శౌరీ, గౌస్, ఉస్మాన్, గడ్డం రాజశేఖర్, దావూద్ పాల్గొన్నారు.

పుస్తక పఠనం విజయ సోపానం..


పుస్తకాలను పరిశీలిస్తున్న అధ్యాపకులు

ఇల్లెందురూరల్: విద్యార్థి పుస్తక పఠనం ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతాడని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, లైబ్రేరియన్‌సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం కళాశాల ఆవరణలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచడమే వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన విరామ సమయంలో గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలను చదవి, పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. కళాశాల గ్రంథాలయంలో విద్యార్థుల కోసం న్యూస్ పేపర్లు, అకడమిక్, పాఠ్య పుస్తకాలు, ఇంటర్నెట్, వైఫై సౌకర్యాలను అందుబాటులో ఉంచామని వివరించారు. అనంతరం జాతీయ గ్రంథాలయ సంస్థ పితామహుడు రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కాటాలో మోసాన్ని గుర్తించిన రైతులు


పత్తి వ్యాపారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

చర్ల: మండలంలో పత్తి వ్యాపారుల మోసాన్ని గుర్తించిన రైతులు వారికి దేహశుద్ధి చేశారు. మండలంలోని సింగసముద్రంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. జూలూరుపాడు మండలానికి చెందిన కొందరు పత్తి వ్యాపారులు ఇటీవల చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో పత్తి కొనుగోలు చేసేందుకు వస్తున్నారు. గ్రామాల్లో తిరిగి రైతుల వద్ద నుంచి పత్తిపంటను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు సింగసముద్రంలో బుధవారం ఉదయం కొందరు రైతుల వద్ద నుంచి పత్తి కొనుగోలు చేసి తీసుకొని వెళ్తున్నారు. పత్తి అమ్మిన రైతుల్లో కొందరు ముందుగానే వారి సొంత కాటాల ద్వారా పత్తిని కాటా వేసుకోగా వ్యాపారులు వేసిన కాటాలకు, రైతుల కాటాకు తేడా వచ్చింది. పత్తి కొనుగోలు చేసిన వ్యాపారులు తీసుకొని వెళ్తున్న సందర్భంలో రైతులు వారిని అడ్డగించి నిలదీసి, దేహశుద్ధి చేశారు. వారి పత్తిని తిరిగి తీసుకున్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ రాజువర్మ తెలిపారు.

ఆమె.. ఆయనలో సగభాగం

భర్తకు కాలేయదానం చేసిన భార్య


ఆస్పత్రిలో భార్యాభర్తలు లావణ్య, శ్రీను

రఘునాథపాలెం: వివాహం జన్మజన్మల అనుబంధమని, చెరోసగంగా భార్యాభర్తలు జీవనం సాగించడం అన్యోన్య దాంపత్యమని పెద్దలు చెబుతారు. ఈ తరహాలోనే ఓ మహిళ తన భర్తను బతికించుకునేందుకు కాలేయదానం చేసి ఆయనలో సగభాగంగా మారడమే కాదు.. కలకాలం కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని పెళ్లి రోజున చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడి నిలిచినట్లయింది. రఘునాథపాలెం మండలం పెద్ద ఈర్లపూడికి చెందిన ధారావత్ శ్రీను ఖమ్మంలోని ఏపీజీవీబీలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన భార్య లావణ్య ఎల్‌ఎల్‌బీ చివరి సంవత్సరం చదువుతుండగా వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్నాళ్ల క్రితం శ్రీను అనారోగ్యం బారిన పడడంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నాడు. కామెర్లు సోకగా కాలేయం సమస్య ఎదురైందని వైద్యులు గుర్తించారు. ఆపై హైదరాబాద్‌లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. అంతేకాక వివిధ పరీక్షల అనంతరం కాలేయ మార్పిడి మాత్రమే శ్రీనును బతికిస్తుందని వైద్యులు తేల్చిచెప్పారు. దీంతో కాలేయదానం చేసే వారి కోసం ఆరా తీస్తుండగా లావణ్యే ముందుకొచ్చింది. తన భర్తను కాపాడుకోవడానికి లివర్ ఇస్తానని చెప్పడంతో పరీక్షలు చేసిన వైద్యులు సరిపోతుందని నిర్ధారించారు. ఈ మేరకు లావణ్య లివర్ నుంచి 65శాతం మేర తీసిన సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు ఈనెల 16న శస్త్రచికిత్స ద్వారా శ్రీనుకు అమర్చారు. ప్రస్తుతం దంపతులిద్దరూ ఆరోగ్యంగా ఉండగా కోలుకుంటున్నారని కుటుంబీకులు తెలిపారు.

కోల్ ఇండియా స్థాయిలో ప్రతిభ చూపాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏరియా జీఎం, అధికారులు

మణుగూరుటౌన్: కోల్ ఇండియా స్థాయిలో సింగరేణి విజయకేతనం ఎగురవేయాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. బుధవారం సింగరేణి కాలరీస్ డబ్ల్యూపీఎస్ అండ్ జీపీఏ ఆధ్వర్యంలో మణుగూరు భద్రాద్రి స్టేడియంలో హాకీ టోర్నమెంట్ ముగిసింది. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. కార్మికులు యోగా, ధ్యానం, క్రీడల కోసం కొంత సమయం కేటాయించాలన్నారు. క్రీడాపోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన మందమర్రి బెల్లంపల్లి, రన్నరప్‌గా నిలిచిన శ్రీరాంపూర్ జట్లకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో వై.రాంగోపాల్, కృష్ణంరాజు, శ్యాంసుందర్, సలగల రమేశ్, పాసినేట్, వెస్లీ, అశోక్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు ఉన్నారు.

డీఆర్‌యూసీసీ మెంబర్‌గా శ్రీనివాసరెడ్డి


ఎంపీని సత్కరిస్తున్న శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ(డీఆర్‌యూసీసీ) మెంబర్‌గా కొత్తగూడెంనకు చెందిన యరమల శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సిఫారసుతో నియమితులైన ఆయన రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఎంపీని బుధవారం ఖమ్మంలో కలిసిన శ్రీనివాసరెడ్డి తన నియామకానికి సహకరించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఉమ్మడి జిల్లాలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందేలా రైల్వే బోర్డు సమావేశాల్లో చర్చించాలని ఎంపీ ఆయనకు సూచించారు. నాయకుడు కొప్పుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పత్తి మిల్లులో కార్మికుడి మృతి

- పత్తి మీద పడడంతో ఊపిరి ఆడక కన్నుమూత

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండా పరిధిలోని శ్రీ భాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్‌లో పనిచేస్తున్న ఓ కార్మికుడు మృతి చెందాడు. ఎస్‌ఐ కూచిపూడి జగదీష్ తెలిపిన వివరాలు.. మహారాష్ట్రకు చెందిన మాధవన్(20) కొన్నాళ్లుగా మిల్లులో పనిచేస్తుండగా మంగళవారం రాత్రి పత్తి బేళ్లపై నిద్రించాడు. అయితే, అర్ధరాత్రి చలి పెరగడంతో పక్కనే కుప్పగా వేసిన పత్తిలో పడుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని గమనించని యంత్రం డ్రైవర్ పత్తిని తీస్తుండగా మాధవన్‌పై పడడంతో ఊపిరి ఆడక అస్వస్థతకు గురయ్యాడు. కాసేపయ్యాక సహచర కార్మికులకు మాధవన్ కనిపించకపోవడంతో సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి పత్తిలో కూరుకుపోయినట్లు గుర్తించారు. ఆపై వాహనంలో ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా, వారు చేరుకున్నాక అజాగ్రత్తగా యంత్రాన్ని నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న ఇమ్రాన్

సత్తుపల్లి: కుటుంబ కలహాల కారణంగా ఓ యువకుడు గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లి ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఇమ్రాన్ బేతుపల్లికి చెందిన నందినిని ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొన్నాళ్లకు ఇరువురి మధ్య గొడవలు మొదలవడంతో నందిని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో బుధవారం బేతుపల్లికి వెళ్లిన ఇమ్రాన్ తన భార్యను పంపించాలని ఆమె కుటుంబీకులను బెదిరిస్తూ బ్లేడ్‌తో పీక కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఈమేరకు ఆయనను సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడి నుంచి పారిపోయే యత్నం చేయడంతో కుటుంబీకులు, ఆస్పత్రి సిబ్బంది పట్టుకుని చికిత్స చేశారు. గతంలో కూడా ఇమ్రాన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు

చింతకాని: మండలంలోని తిమ్మినేనిపాలెంకు చెందిన కొమ్ము మహేందర్ (55) గ్రామ సమీపంలోని మున్నేరులో బుధవారం చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. ఆయన సాయంత్రమైనా ఇంటికి రాకపోవటంతో కుటుంబీకులు, గ్రామస్తులు మున్నేరు వద్దకు వెళ్లి వెతికారు. అయినా ఫలితం లేక పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై నాగుల్‌మీరా.. అగ్నిమాపక సిబ్బందితో పాటు గజ ఈతగాళ్లను పిలిపించి రాత్రి వరకు గాలించినా మహేందర్ ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం ఉదయం మళ్లీ గాలింపు చేపడుతామని ఎస్సై తెలిపారు.

ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు



రోడ్డెక్కిన పత్తి రైతులు

- కొనుగోళ్లు నిలిపివేయడంతో ప్రధాన రహదారిపై ధర్నా
- ఆంక్షలు తొలగించాలని కొనుగోళ్లకు రాని వ్యాపారులు
- అధికారుల హామీతో విరమణ

జూలూరుపాడు: కమీషన్ తీసుకోవద్దని, పత్తి క్వింటాకు రెండు కిలోల తారం తీయొద్దని అధికారులు ఆంక్షలు విధించడంతో వ్యాపారులు బుధవారం స్థానిక ఉప మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. అయితే, ముందస్తు సమాచారం ఇవ్వకుండా తాము వాహనాల్లో పత్తి తీసుకొచ్చాక ఇలా చేయడం సరికాదంటూ రైతులు తల్లాడ – కొత్తగూడెం ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఓ పక్క దిగుబడి లేక, ధర రాక ఇబ్బంది పడుతున్న తమను మరింత ఇక్కట్లకు గురిచేయొద్దని డిమాండ్ చేశారు. రైతులకు సీపీఎం, సీపీఐ నాయకులు మద్దతు పలకగా రెండు వైపులా పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అలాగే, ట్రాఫిక్‌లో నిలిచిపోయిన బీఆర్‌ఎస్ నాయకుడు కోనేరు సత్యనారాయణ రైతులతో మాట్లాడి విషయాన్ని కలెక్టర్ పాటిల్‌కు ఫోన్‌లో వివరించారు. అంతలోనే పత్తి కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని మార్కెట్ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు యాసా నరేశ్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, నాయకులు గార్లపాటి వెంకటి, గడిదేశి కనకరత్నం, ఎస్కే చాంద్‌పాషా, ఇల్లంగి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

రైతులను ఇబ్బంది పెట్టకుండా నిబంధనల మేరకు పత్తి కొనుగోలు చేయాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచించారు. జూలూరుపాడులో రైతులు ఆందోళన చేపట్టిన విషయం తెలియడంతో ఆయన చేరుకున్నారు. అప్పటికే రైతులు ఆందోళన విరమించగా, పత్తి కొనుగోళ్లు మొదలయ్యాయి. ఈ మేరకు వ్యాపారులతో మాట్లాడిన ఆయన ఏదైనా సమస్య ఉంటే రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలే తప్ప కొనుగోళ్లు నిలిపివేయొద్దని హెచ్చరించారు. అలాగే, మార్కెటింగ్ శాఖ ఖమ్మం జిల్లా అధికారి ఎం.ఏ.అలీం కూడా వచ్చి కొనుగోళ్లను పరిశీలించి వ్యాపారులతో సమావేశమయ్యారు. కమీషన్, తరుగు సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు 8 నుంచి 12 శాతం మేర తేమ ఉండేలా పత్తి తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. కాగా, ఖమ్మం జిల్లాలో తొమ్మిది కేంద్రాలు ఇప్పటి వరకు 5 వేల మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు చేశాయని తెలిపారు. ఏన్కూరు మార్కెట్ కార్యదర్శి బజారు, సూపర్‌వైజర్ రామారావు, వ్యాపారులు పెండ్యాల రామనర్సింహారావు, తొండెపు నవీన్, ఎస్‌కే.అన్వర్, ఉడుతా వెంకటేశ్వర్లు, కొదుమూరి రమేశ్, కమలాకర్, ఎస్‌డీ యాసిన్, తొండెపు సుబ్బారావు, దుగ్గిన్ని బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి ఉర్సే షరీఫ్ ఉత్సవాలు

హజరత్ నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గాలో ఏర్పాట్లు


దర్గాలో కొలువుదీరిన హజరత్ నాగుల్‌మీరా

ఇల్లెందురూరల్: మండలంలోని హజరత్ నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గా షరీఫ్‌లో కులమతాలకు అతీతంగా నిర్వహించే ఉర్సే షరీఫ్ ఉత్సవాలు నవంబర్ 30, డిసెంబర్ 1వ తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రచార పోస్టర్‌ను ఉత్సవ కమిటీ ప్రతినిధులు బుధవారం ఆవిష్కరించారు. మండలంలోని సత్యనారాయణపురం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో హజరత్ నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గా షరీఫ్‌లో కొలువుదీరిన నాగుల్‌మీరా సమక్షంలో ఉర్సు ఉత్సవాలు ఏటా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 22వ ఉర్సు ఉత్సవాల కోసం దర్గా ముస్తాబవుతోంది. ఏటా పట్టణంలోని హజరత్ ఖాసీం దుల్హా దర్గాహ్ షరీఫ్‌లో కార్తీక పౌర్ణమి రోజున ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తారు. తిరిగి మండలంలోని సత్యనారాయణపురం గ్రామ శివారులోని నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గా షరీఫ్‌లో అమావాస్య రోజు వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. ఉర్సే షరీఫ్ ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని హజరత్ ఖాసీం దుల్హా దర్గా షరీఫ్ నుంచి ఈ నెల 30 తేదీన సాయంత్రం 5 గంటలకు చాదర్‌ను, సాయంత్రం 6 గంటలకు సందల్‌ను ఊరేగింపుగా నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గా షరీఫ్‌కు చేరుస్తారు. డిసెంబర్ 1వ తేదీన ఉదయం 8 గంటలకు హజరత్ ఖాసీం దుల్హా దర్గాహ్ షరీఫ్ నుంచి భారీ జులూస్ ప్రారంభమై నాగుల్‌మీరా మౌలాచాన్ దర్గా షరీఫ్ వరకు కొనసాగుతుంది. దర్గాలో మధ్యాహ్నం 12 గంటలకు దావతే హజరత్, సాయంత్రం 6 గంటలకు సలామీ, రాత్రి 7 గంటలకు ఖవ్వాలి నిర్వహిస్తామని నిర్వాహకులు వివరించారు.


ఉత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చంద్రబాబు భాషకు అర్థాలు వేరు
బాదడమే సంపద సృష్టి!

ప్రజలపై యూజర్ ఛార్జీలు, పన్నులు, టోల్ ఛార్జీలు.. అదేనా నీ సూత్రం?
సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: 'సంపద సృష్టి అంటే ప్రజలపై యూజర్ ఛార్జీలు, పన్నులు, టోల్ ఛార్జీలు, విద్యుత్ ఛార్జీలు బాదడమేనా? మేం సృష్టించిన సంపద మెడికల్ కాలేజీలు, పోర్టులను స్కామ్‌ల కోసం అమ్మేయడమేనా?' అని ముఖ్యమంత్రి చంద్రబాబును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ నిలదీశారు. చంద్రబాబు సంపద సృష్టిస్తానన్న ప్రతిసారి ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'సంపద సృష్టిస్తా' అన్నది చంద్రబాబు ఊత పదం (కామన్ డైలాగ్)గా మారిందని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు సంపద సృష్టిలో భాగంగా మెడికల్ కళాశాలలను, రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మూడు పోర్టులను అమ్మేస్తున్నారు. పోర్టులకు సంబంధించి దాదాపు 50 శాతం పనులు పూర్తయ్యాయి. మారిటైం బోర్డు పెట్టి పోర్టుల నిర్మాణానికి అడ్డంకులు లేకుండా ఫైనాన్షియల్ టై అప్ చేశాం. బ్యాంకులు ప్రత్యేకంగా లోన్లు ఇస్తున్నాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కడుతున్న పోర్టులు, మెడికల్ కాలేజీలు భవిష్యత్తులో రూ.లక్షల కోట్ల సంపద అవుతుంది. నాగార్జునసాగర్ కట్టడానికి అప్పట్లో రూ.600 కోట్లు -రూ.900 కోట్లు అయినట్టుంది. ఇప్పుడు సాగర్ లాంటి ప్రాజెక్టును కట్టాలంటే ఎన్ని వేల కోట్లు కావాలి? ఈ రోజు కట్టే పోర్టులు, వైద్య కళాశాలల విలువ కూడా అంతే. ఇలాంటివి కడితేనే రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు ఆదాయం తయారవుతుంది. దీన్ని సంపద సృష్టి అంటారు. చంద్రబాబు మాత్రం సంపద సృష్టి పేరుతో స్కామ్‌లు చేస్తున్నారు. తనకు కావాల్సిన వాళ్లకు పోర్టులు, వైద్య కళాశాలలను అమ్మేస్తున్నారు' అని మండిపడ్డారు. 'కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై టోల్ వసూలు చేస్తున్న మాదిరిగా గ్రామీణ రహదారులపైనా రాష్ట్ర ప్రభుత్వం టోల్ వసూలు చేయాలని అసెంబ్లీలో చంద్రబాబు చెబుతున్నారు. అంటే ప్రయాణికులు రోడ్లపై తిరిగే దానికి యూజర్ చార్జీలు వసూలు చేస్తారట. దీనినే సంపద సృష్టిగా చంద్రబాబు అభివర్ణిస్తున్నారు. పన్నులతో బాదేసి సంపద సృష్టి అంటే ఆశ్చర్యంగా ఉంది. పైగా ఎన్నికలకు ముందు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు రోడ్లపై విపరీతమైన దుష్ప్రచారం చేశారు. వాళ్ల ఐదేళ్ల కాలంలో రోడ్ల కోసం రూ.24,792.19 కోట్లు ఖర్చు చేస్తే, మా హయాంలో రూ.43,036.28 కోట్లు వెచ్చించాం. ఇంత ఖర్చు చేసినా కూడా దుష్ప్రచారం ఎదుర్కొన్నాం. బాబు మాత్రం నిస్సిగ్గుగా సమర్థించుకుంటున్నారు' అని నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

బినామీలకు దోచిపెట్టేందుకే అసైన్డ్‌పై దుష్ప్రచారం

- అసైన్డ్ భూములపై నిస్సిగ్గుగా అబద్ధాలు.. తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. మా ప్రభుత్వం రాక ముందు పేరుకే దళితులకు భూమి ఉండేది. దానిని అమ్ముకునే స్వేచ్ఛ లేదు. ఇంట్లో వాళ్లకు అత్యవసర పరిస్థితులు ఎదురైనా, వారసుల పేరుపైకి బదిలీ చేయాలన్నా అగమ్య గోచర పరిస్థితి ఉండేది. రిజిస్ట్రేషన్ చేసి అమ్ముకోలేని నిస్సహాయ స్థితిలో శనక్కాయలకు.. పావలాకు, పది పైసలకు వేరే వాళ్లు కొనుక్కొని అనుభవించే వారు.
- మేము అధికారంలోకి వచ్చాక పేదల జీవితాలు మార్చాలని ఆలోచించాం. 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూమి ఉన్న వారికి చట్ట ప్రకారం అన్ని హక్కులు కల్పిస్తూ సొంత భూములుగా మార్చాం. ఆ సొంత భూములను అమ్ముకుంటారా? వాళ్ల పిల్లలకు ఇచ్చుకుంటారా? వాళ్ల ఇష్టం. ఈ లోగా ఎవరైనా భూములు కొనుగోలు చేసి ఉంటే కూడా అవన్నీ ఒరిజినల్ అసైనీలకు వెళ్లిపోతాయి. వాళ్ల పేరుతోనే పట్టా వస్తుంది. కొన్ని వాళ్లకు పట్టా రాదు. ఇలా హక్కులిచ్చి 15.21 లక్షల మంది రైతులకు, పేదలకు మంచి చేస్తే కూటమి నాయకులు నిస్సిగ్గుగా బురద వేస్తున్నారు. మళ్లీ పేదల దగ్గర నుంచి హక్కులు తీసుకోవడానికి అడుగులు వేస్తున్నారు. చట్టాన్ని రద్దు చేయడం ద్వారా వారి హక్కులను రద్దు చేయనున్నారు. ఆ తర్వాత అవే భూములను పెత్తందార్లు 10 పైసలకు, 20 పైసలకు కొనుక్కోవచ్చు. వీళ్లకు మాత్రమే మంచి రేటు ఉండాలి. పేదలకు మాత్రం మంచి రేటు రాకూడదు.
- చంద్రబాబు ఇచ్చిన ఒక మెమో ద్వారా 2.06 లక్షల ఎకరాలను ఉద్దేశ పూర్వకంగా నిషేధిత జాబితా (22ఏ)లో పెట్టారు. 98 వేల మంది రైతులను నానా కష్టాలకు గురి చేస్తున్నారు. మేము నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించి.. రైతుల భూమిపై చంద్రబాబు చేసిన దాష్టీకం నుంచి విడుదల చేశాం. వారి భూములపై సర్వ హక్కులు కల్పించాం. అది తప్పంటున్నారు.

ఐదేళ్లలో ఒక్కరికైనా సెంటు స్థలం ఇచ్చావా?

- చంద్రబాబు హయాంలో ఒక్క నిరుపేద కుటుంబానికి కనీసం ఒక్క సెంటు స్థలమైనా ఇచ్చారా? మేము 30.60 లక్షల కుటుంబాలకు అక్క చెల్లెమ్మల పేరుపైనే రిజిస్ట్రేషన్ చేసి ఇంటి స్థలాలు ఇచ్చాం. ఇందులో 21 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాం. 9.02 లక్షల ఇళ్లను పూర్తి చేశాం. మిగిలిన 11 లక్షల ఇళ్లు పునాదులు దాటి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. ఏకంగా 17 వేల జగనన్న కాలనీల్లో ఏకంగా ఊళ్లే తయారవుతున్నాయి. ఆ ఇళ్లన్నీ పూర్తయితే జగన్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోననే దురుద్దేశంతో చంద్రబాబు హౌసింగ్ కార్యక్రమాన్ని ఆపేశారు.
- మా ప్రభుత్వ హయాంలో సిమెంట్, స్టీలు, ఇతర సామగ్రిని సబ్సిడీపై, ఇసుకను ఉచితంగా ఇచ్చే వాళ్లం. ఇవి కాకుండా రూ.35 వేలు పావలా వడ్డీకి రుణంగా ఇచ్చే వాళ్లం. రూ.1.80 లక్షల డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందించే వాళ్లం. అంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిలిపి వేసినందుకు నిరుపేదలందరూ చంద్రబాబును తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టుకుంటున్నారు. పేదల ఇళ్ల గురించి ఎవ్వరూ పట్టించుకోవట్లేదు. ఎందుకు అసెంబ్లీ నడుపుతున్నారో.. ఎందుకు ప్రభుత్వాన్ని నడుపుతున్నారో వీళ్లకే తెలీదు.

మరిన్ని వార్తలు, వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మద్యం, ఇసుక అంతా స్కామ్..

- రాష్ట్రంలో ప్రజలకు అవసరమైన పనులు పూర్తిగా పక్కకు వెళ్లిపోయాయి. ఎక్కడ చూసినా మాఫియా ముఠాలు దోచుకుంటున్న పరిస్థితి. చంద్రబాబు అధికారంలోకి వస్తే నాణ్యమైన లిక్కర్ ఇస్తానన్నారు. మద్యం రేటు తగ్గిస్తానన్నారు. ఆశ్చర్యం ఏమంటే.. గతంలో చంద్రబాబు హయాంలో అవే డిస్టలరీలు.. మా హయాంలో అవే.. ఇప్పుడు కూడా అవే డిస్టలరీలు. మద్యం ఆదాయంలో చీప్ లిక్కర్ నుంచే 85 శాతం వస్తుంది. చంద్రబాబు వచ్చిన తర్వాత చీప్ లిక్కర్‌లో నాణ్యత తగ్గించారు. ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కొత్త బ్రాండ్లను తీసుకొచ్చారు. ఎప్పుడూ మనం వినని, చూడని బ్రాండ్లు అవి.
- అన్ని చోట్లా బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. ఒక్కో బెల్టు షాపునకు.. ఒక్కో గ్రామంలో పోటీ పెట్టి వేలం వేస్తున్నారు. రూ.2 లక్షలకు పాడుకున్న వాడికే ఇస్తున్నారు. ఇలా మాఫియా రాజ్యం నడుస్తోంది. మద్యాన్ని ఎమ్మార్పీకి అమ్మకోవాలంటే పోటీ ఎందుకు? ఎమ్మెల్యేలు మనుషులను ఎందుకు కిడ్నాప్ చేయించాలి.. ఎందుకు ఎవరినీ పాడనివ్వకుండా చేయాలి? వేరేవాళ్లకు వచ్చినా షాపులు నడుపుకోలేని పరిస్థితికి ఎందుకు నెట్టేయాలి? ఎమ్మార్పీ ప్లస్ మాఫియాకు కమిషన్ రావాలనే ఇదంతా చేస్తున్నారు. ప్రభుత్వం నడుపుతున్న షాపులన్నీ తీసేశారు. ప్రైవేటు మాఫియాను తీసుకొచ్చి అన్ని రకాలు స్కాములకు తెరదీశారు. ఇసుక పరిస్థితి కూడా అంతే. హామీ ఇచ్చినట్లు ఎక్కడా ఉచితంగా ఇవ్వడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. గతంలో ఆ డబ్బు ప్రభుత్వ ఖజానాకు చేరేది. ఇప్పుడు అధికార పార్టీ నేతల జేబుల్లోకి వెళ్తోంది.

మోసాలు, అక్రమాలు, వైఫల్యాలు నిలదీస్తే అక్రమ కేసులా?

- సూపర్ సిక్స్‌లు లేవు.. సూపర్‌సెవెన్‌లు లేవు.. మరో వైపు అన్ని రకాలుగా రాష్ట్రం వైఫల్యం చెందింది. ఎవరైనా హక్కుల కోసం, న్యాయం కోసం సోషల్ మీడియాలో ప్రస్తావిస్తే చాలు దారుణంగా వేధిస్తున్నారు. పోలీసులను అన్యాయంగా వాడుకుంటున్నారు. ఎమ్మెల్యేల ద్వారా వాళ్ల నియోజకవర్గాల్లో ప్రైవేటు మాఫియా ముఠాను తయారు చేసి కొట్టిస్తున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నారు. ఇష్టానుసారంగా తప్పుడు కేసులు పెడుతున్నారు. అక్రమ నిర్బంధాలు (ఇల్లీగల్ డిటెన్షన్) చేస్తున్నారు. తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారు.
- రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని తప్పుడు సంప్రదాయానికి నాంది పలుకుతున్నారు. ఒక వైపు కేసులు పెట్టడం, మరొక వైపు ఎవరైనా మాట్లాడితే అన్యాయంగా దూషించడం. ఇంకొక వైపు దుష్ప్రచారాలు చేయడం. ఇది చంద్రబాబు నైజం. టాపిక్ డైవర్షన్, తప్పుడు ప్రచారం, అబద్ధాలు, మోసాలు చేయడంలో చంద్రబాబు స్పెషలిస్ట్. ప్రత్యర్థుల వ్యక్తిత్వ హననం (క్యారెక్టర్ అసాస్‌నేట్) చేయడంలో ప్రసిద్ధుడు. లక్ష్మీపార్వతితో మొదలు నా వరకు ఎలా ప్రచారం చేశారో చూశాం.

నా చెల్లిపై దుష్ప్రచారం చేసింది చంద్రబాబే

- చంద్రబాబు తప్పుడు ప్రచారంపై గతంలో నా చెల్లెలు షర్మిల ఏమన్నారో చూడండి. (వీడియోను ప్రదర్శిస్తూ..) ఆ వీడియోలో షర్మిల మాట్లాడుతూ.. 'ఎన్బీకే బిల్డింగ్ నుంచి దుష్ప్రచారం జరిగిందని ఐపీ అడ్రస్‌ను బట్టి పోలీసులు చెబుతున్నారు. ఈ వెబ్‌సైట్‌లన్నీ ప్రొ టీడీపీ ప్రమోట్ చేసినవే. ప్రత్యర్థులను కించపరిచేవి. ఈ పోస్టింగ్‌లన్నీ బాలకృష్ణ బిల్డింగ్ నుంచి, ప్రో టీడీపీ సైట్‌ల నుంచి జరిగాయంటే బాలకృష్ణకు సంబంధం లేదని నేను ఎలా అనుకోవాలి? సంబంధం ఉంది కనుకే బాలకృష్ణ నా మీద నింద వేశారని, పుకార్లు పుట్టించారని, వాటిని ప్రచారం చేశారని నేను విశ్వసిస్తున్నా. బాలకృష్ణ ఇలా దిగజారుడు తనానికి ఎందుకు పాల్పడ్డారో ఆయనే చెప్పాలి.
- మా ప్రభుత్వ హయాంలో వర్రా రవీంద్రరెడ్డి పేరిట ఐ టీడీపీ సభ్యుడు ఉదయ్‌భూషణ్ ఒక ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి మా అమ్మను, మా చెల్లెలిని తిట్టించాడు. వర్రా రవీంద్రరెడ్డి పెట్టిన కేసు ఆధారంగా ఫిబ్రవరిలోనే ఉదయ్ భూషణ్‌ను ఆధారాలతో పోలీసులు అరెస్ట్ చేశారు. చంద్రబాబు ఎంత దారుణమైన నికృష్టుడంటే తన స్వార్థం కోసం ఎవరినైనా సరే వ్యక్తిత్వ హననం చేస్తాడు. వాళ్ల సానుభూతిపరులతో ఫేక్ ఐడీ క్రియేట్ చేయించి, వాళ్లతో మన వాళ్లను తిట్టిస్తాడు. మళ్లీ మనం తిట్టించామని బయట ప్రచారం చేస్తాడు. ఇటువంటి మనిషి ప్రపంచ చరిత్రలో ఎక్కడా ఉండడు. చాలా అరుదుగా పుడతారు ఇలాంటి రాక్షసులు. మన కర్మ ఏంటంటే ఈయన మన రాష్ట్రంలో పుట్టడం. చంద్రబాబు నైజం ఎలా ఉంటుందో ఇంతకంటే ఇంకేం చెప్పమంటారు?



బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

'ప్రాసిక్యూటర్స్' అసోసియేషన్ అధ్యక్షుడిగా రాంరెడ్డి



రాంరెడ్డి



కె.శ్రీవాణి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కేడర్ ప్రాసిక్యూటర్స్ వెల్ఫేర్ అండ్ డిపార్ట్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా అల్లూరి రాంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఏర్పడిన ఈ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు ఈనెల 19న జరిగాయి. ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఈ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కేడర్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు. ఈమేరకు ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఫలితాలను ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా పి.సత్యనారాయణ, పి.రవికిరణ్, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీవాణి (ఏపీపీ గ్రేడ్-1), ట్రెజరర్‌గా ఆర్.రాఘవేందర్, అదనపు కార్యదర్శులుగా కె.శంకర్, జి.ప్రణయ్ ఎన్నికైనట్లు తెలిపారు. అలాగే మహిళా ప్రతినిధిగా సొంబ దుర్గాబాయ్, సునీతతో పాటు 11 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం ఎన్నికపై రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ ప్రాసిక్యూటర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. పీపీల సమస్యలు పరిష్కరించేందుకు అహర్నిశలు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

జిల్లా వార్తలు

24న ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ శ్రీనివాసరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఈనెల 24న నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థుల వేదిక బాధ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు వెల్లడించారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో గురువారం వారు మాట్లాడారు. ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో జరిగే సమ్మేళనానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,500 మంది వరకు హాజరుకానుండగా, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ఎస్‌ఎఫ్‌ఐ ఉమ్మడి ఏపీ మాజీ కార్యదర్శి వి.కృష్ణయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఎస్‌ఎఫ్‌ఐ జెండాను సీనియర్ నాయకులు ఆవిష్కరించనుండగా, ప్రొఫెసర్ నాగేశ్వర్, వి.కృష్ణయ్య, ఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రెసిడెంట్ ఐసీ.ఘోష్ మాట్లాడుతారని తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి పూర్వ విద్యార్థుల కళా సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. కాగా, సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు 22మందితో కమిటీని నియమించినట్లు తెలిపారు. సమ్మేళనం కోకన్వీనర్ రాజేశ్వరరావు తో పాటు ఎస్.డి.జావిద్ పాల్గొన్నారు.

24న ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు

పాల్వంచరూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలను ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుట్ట శంకరయ్య తెలిపారు. పాల్వంచ మండలం కిన్నెరసానిలోని క్రీడా పాఠశాల మైదానంలో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారితో రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా స్థాయి జట్టును ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు.

అన్నదాన ప్రభువే.. శరణం అయ్యప్పా..

- కొత్తగూడెం శ్రీ ధర్మశాస్తా ఆలయంలో మాలధారులకు నిత్యాన్నదానం
- 24ఏళ్లుగా మధ్యాహ్న భోజనం, రాత్రి అల్పాహారం
- ఏటా నవంబర్ 15నుంచి జనవరి 10వరకు నిర్వహణ



కొత్తగూడెం రైటర్‌బస్తీలోని శ్రీధర్మశాస్తా ఆలయం

కొత్తగూడెంటౌన్: అయ్యప్ప మాల ధరించే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. అయితే, స్వస్థలంలో ఉండే వారికి మధ్యాహ్న భోజనం, రాత్రి అల్పాహారానికి ఇబ్బంది లేకున్నా ఇంట్లో ప్రత్యేక వంట చేసే పరిస్థితులు లేని వారు, పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు సమస్య ఎదుర్కొంటారు. ఈ నేపథ్యాన కొత్తగూడెంలోని శ్రీధర్మశాస్తా ఆలయంలో గత 24ఏళ్లుగా మాలధారులకు మధ్యాహ్న భోజనం, రాత్రి అల్పాహారం ఉచితంగా సమకూరుస్తున్నారు.

అరటి ఆకుల్లో సద్ది..

కొత్తగూడెం రైటర్‌బస్తీలోని శ్రీధర్మ శాస్తా ఆలయానికి కార్తీక మాసంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇందులో అయ్యప్ప మాల ధరించిన వారు వందల సంఖ్యలో ఉంటారు. పట్టణ వాసులకే కాక మాల ధరించి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి సైతం ఈ ఆలయంలో ఏటా నవంబర్ 15నుంచి జనవరి 10వ తేదీ వరకు మధ్యాహ్న భోజనం, రాత్రి అల్పాహారం ఉచితంగా సమకురుస్తున్నారు. పెనగడపలోని తోటల నుంచి అరటి ఆకులు తెప్పించి భోజనం వడ్డిస్తుండడం విశేషం. దీంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి పనులపై వచ్చిన భక్తులు సైతం ఇక్కడ 'సద్ది' స్వీకరిస్తారు. దాతల సాయంతో 2000 సంవత్సరం నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తుండగా రోజూ మధ్యాహ్నం 400 మందికి పైగా మాలధారులకు భోజనంతో పాటు రెండు రకాల కూరలు, మజ్జిగ సమకూరుస్తున్నారు. ఇక రాత్రి ఉప్మా, ఇడ్లీ, వడ వంటి అల్పాహారం అందిస్తున్నారు.



ఆలయంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న అయ్యప్ప మాలధారులు

నిత్యాన్నదానం మా అదృష్టం..



మాలధారులకు 24 ఏళ్లుగా ఉచిత నిత్యాన్నదానం చేస్తున్నాం. ఇందుకు దాతల నుంచి సహకారం అందుతోంది. అయ్యప్ప దీక్ష స్వీకరించే భక్తులకు భోజనం, అల్పాహారం అందించడాన్ని మా అదృష్టంగా భావిస్తున్నాం. మధ్యాహ్నం 400మందికి పైగా, రాత్రి సుమారు 150 మంది ఇక్కడ అల్పాహారం స్వీకరిస్తారు. – కన్నెగంటి కృష్ణమూర్తి, శ్రీధర్మశాస్తా ఆలయ ప్రధాన కార్యదర్శి

గత 20 ఏళ్లుగా మాల ధరిస్తున్నా...



నాకు అయ్యప్ప అంటే భక్తి. గత ఇరవై ఏళ్లుగా నేను మాల ధరిస్తున్నా. మాలధారణ సమయంలో నిత్యం పూజలు, భజనలు చేస్తుంటాం. అలాగే, స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మాలధారులకు దాతల చేయూతతో మధ్యాహ్న భోజనంతో పాటు రాత్రి అల్పాహారం అందజేస్తున్నాం.

– జక్కుల విజయ్‌కుమార్, కొత్తగూడెం

ఇరవై ఏళ్లుగా ఇక్కడే సద్ది...



నేను అయ్యప్ప మాల ఇరవై ఏళ్లుగా ధరిస్తున్నా. ఏటా మాలధారణ సమయంలో మధ్యాహ్న భోజనంతో పాటు రాత్రి అల్పాహారం సైతం ఇక్కడే తీసుకుంటాం. భక్తిభావంతో వంటలు చేసి మాలధారులకు సమకూరుస్తారు. భక్తులు ఇబ్బంది పడకుండా నిత్యాన్నదానం చేయడం అభినందనీయం.

– గరినే శ్రీనివాసరావు, కొత్తగూడెం



మాట్లాడుతున్న వెంకటేష్‌శర్మ, పక్కన మాలధారులు

48 రోజుల దీక్ష తర్వాతే ఇరుముడి ఉత్తమం

సత్తుపల్లిటౌన్: అయ్యప్ప మాలధారులు నియమ నిష్టలతో 48 రోజుల దీక్ష చేశాకే ఇరుముడి కట్టుకోవాలని కేరళ మేలు తంత్రి చంద్రమౌళి వెంకటేష్‌శర్మ తెలిపారు. సత్తుపల్లిలోని శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడారు. మాలధారణ చేసిన భక్తులు ఇంట్లో లేదా ఆలయాల్లో సాత్విక ఆహారం తీసుకోవాలే తప్ప రహదారి వెంట ఆహారం తీసుకోవడం సరికాదన్నారు. పదేళ్లలోపు బాలికలు, 55ఏళ్లు నిండిన మహిళలు శబరిమలైలో స్వామిని దర్శించుకోవచ్చని, అక్కడికి వెళ్లలేని వారు స్థానిక ఆలయాల్లో స్వామిని దర్శించుకోవచ్చన్నారు. కాగా, మకర సంక్రాంతి రోజున వందల ఏళ్లుగా శబరిమలలో ఉత్తర నక్షత్రం రూపంలో స్వామి దర్శనం ఇస్తారని తెలిపారు. అలాగే, అటవీ ప్రాంతాల వారు ఇచ్చే హారతే మకరజ్యోతి అని పేర్కొన్నారు. ఈసమావేశంలో ఆలయ కమిటీ బాధ్యులు దోసపాటి అమరలింగేశ్వరరావు, వందనపు సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌తో పాటు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, దురిశేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

ఐటీడీఏ పీఓ రాహుల్



షాపును ప్రారంభిస్తున్న పీఓ రాహుల్, పొదెం వీరయ్య తదితరులు

భద్రాచలం: ఆదివాసీ గిరిజన మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. దమ్మక్క లయాబిలిటీ గ్రూప్ సభ్యులు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆవరణలో ఏర్పాటుచేసిన షాపును రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్యతో కలిసి పీఓ ప్రారంభించారు. షాపులో సబ్బులు, షాంపూలు, తేనె, వెదురుతో రూపొందించిన కళాఖండాలను పరిశీలించాక పీఓ మాట్లాడారు. భద్రాచలం క్షేత్రానికి వచ్చే భక్తులకు నాణ్యతమైన వస్తువులు అమ్మడం ద్వారా మంచి పేరు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ రమాదేవి, జీసీసీ డీఎం సమ్మయ్య, జేడీఎం హరికృష్ణ, మురళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా చదివితే లక్ష్యసాధన

విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదివితే ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవడం సులువవుతుందని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. దుమ్ముగూడెంలోని ఈఎంఆర్ఎస్ కళాశాలను తనిఖీ చేసిన ఆయన రికార్డులు, తరగతి గదులను, డైనింగ్ హాల్, వంటశాలలను పరిశీలించాక పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. కేవలం చదువు పైనే దృష్టి సారించి క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. అలాగే, క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా పియానో కీబోర్డ్, హాకీ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ పాల్గొన్నారు.

రామయ్య దర్శనం.. నయనానందకరం



ఆలయం వద్ద వృద్ధులు, ఆశ్రమం బాధ్యులు

భద్రాచలంటౌన్: ఏపీలోని విజయనగరం జిల్లా వావిలవలస గ్రామానికి చెందిన రాహుల్‌సౌరభ్ వృద్ధాశ్రమంలో ఉంటున్న 20 మంది వృద్ధులు బుధవారం భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకున్నారు. కార్తీక మాసంలో తెలుగు రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాలను సందర్శించేలా సహకరించాలని వారు ఏపీ ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణను కోరారు. దీంతో ఆయన ఆలయాల సందర్శనకు ఏర్పాట్లు చేయించగా భద్రాచలం వచ్చారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈఓ రమాదేవి దర్శనం చేయించడంతో పాటు వసతి, భోజన సౌకర్యం కల్పించారు.

తోటంతా పూత.. ధవళ వర్ణంతో శోభ!



వాణిజ్య పంటలతో పాటే పలువురు రైతులు కూరగాయల సాగుపై దృష్టి సారిస్తున్నారు. చిక్కుడుకాయలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండడమే కాక మెరుగైన ఆదాయం లభిస్తోంది. ఈ నేపథ్యాన అశ్వారావుపేట మండలంలోని నారంవారిగూడెం, నారంవారిగూడెం కాలనీ, కొత్త నారంవారిగూడెం, మద్దికొండ, అచ్యుతాపురం, పేరాయిగూడెం, వినాయకపురం తదితర గ్రామాల్లో పలువురు చిక్కుడు తోటలు సాగు చేస్తున్నారు. వినాయకపురం వద్ద ఓ రైతు సాగు చేస్తున్న చిక్కుడు తోట విరబూసి ధవళ వర్ణాన్ని సంతరించుకోగా, ప్రధాన రహదారిపై వెళ్తున్న వారు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. – అశ్వారావుపేట రూరల్